క్లుప్తంగా

రక్తనమూనాల సేకరణ


రక్తనమూనాలు సేకరిస్తున్న వైద్యసిబ్బంది

నడిగూడెం : మండల కేంద్రంలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో బోధ కాలు వ్యాధి కారకమైన మైకోఫైలేరియా గుర్తింపుకు ఆదివారం వైద్యసిబ్బంది రక్తనమూనాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఎంహెచ్‌ఓ నిరంజన్ పర్యవేక్షణలో వైద్యసిబ్బంది ఇంటింటికి వెళ్లి రక్త నమూనాలను సేకరించారు. కార్యక్రమంలో త్రిపురవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్.లక్ష్మీప్రసన్న, జెడ్పీటీసీ బాణాల కవిత, స్థానిక సర్పంచ్ గడ్డం నాగలక్ష్మి, వైద్య బృందం పాల్గొన్నారు. ఇటీవల సిరిపురంలో నిర్వహించిన పరీక్షల్లో ఓ పాజిటివ్ కేసు వచ్చినట్లు వైద్యాధికారి లక్ష్మీప్రసన్న తెలిపారు.

ఆలయ నూతన కమిటీ ఎన్నిక


ప్రమాణస్వీకారం చేస్తున్న సభ్యులు

గరిడేపల్లి : మండలంలోని కీతవారిగూడెం గ్రామంలో గల శ్రీ పార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి దేవాలయం 14వ నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం పాలకమండలి ప్రమాణస్వీకారం చేశారు. ఆలయ కమిటీ అధ్యక్షుడిగా కొంగరి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడిగా కీత శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా తోడుపునూరి కృష్ణమూర్తి, కోశాధికారిగా జుట్టుకొండ చంద్రయ్య, కార్యదర్శిగా కీత కోటయ్య, సహాయ కార్యదర్శిగా తుమ్మల వెంకటేశ్వర్లు, గౌరవ అధ్యక్షుడిగా మేళ్లచెరువు రాంమ్మూర్తి, ముఖ్య సలహాదారులుగా రాయప్రోలు శ్రీరామయ్యశర్మ, కార్యవర్గ సభ్యులుగా ఓరుగంటి వెంకటరమణ, చింతకాయల రామచంద్రయ్య, రావుల రామయ్య, వెంకటేశ్వర్లు, సోమయ్య, అంజయ్య, ఉద్దోజు రమేష్, సూరయ్య, సైదయ్య, భద్రయ్య ఎన్నికయ్యారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ కీత జ్యోతి రామారావు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్న ప్రభుత్వాలు


సమావేశంలో మాట్లాడుతున్న శేఖర్‌రావు

గరిడేపల్లి : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ఉద్యమాలపై ఉక్కుపాదం మోపుతున్నాయని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు పారేపల్లి శేఖర్‌రావు అన్నారు. ఆదివారం మండలంలోని తాళ్ల మల్కాపురంలో ఎస్.మట్టయ్య అధ్యక్షతన నిర్వహించిన పార్టీ మండల కమిటీ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో మాజీ సర్పంచ్ రామస్వామి, మాజీ ఎంపీటీసీ యానాల సుశీల, తమ్మల సైదయ్య, అర్జున్, భిక్షం, మట్టయ్య, మహబుబ్‌అలీ, అంజయ్య, సైదిరెడ్డి, రాజేష్ తదితరులున్నారు.

ఉపాధ్యాయురాలికి సావిత్రిబాయి పూలే అవార్డు


రజినిని సన్మానిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యే మల్లయ్యయాదవ్

నడిగూడెం: మండల కేంద్రంలోని సాంఘీక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల ఉపాధ్యాయురాలు ఎస్. రజిని సావిత్రిబాయి పూలే అవార్డు అందుకున్నారు. ఆదివారం సూర్యాపేట జిల్లా కేంద్రంలో సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యుత్‌శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, కోదాడ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ చేతుల మీదుగా ఆమె అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా రజినిని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ సీహెచ్. ధనవిజయలక్ష్మి, తోటి ఉపాధ్యాయులు అభినందించారు.

దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు

నడిగూడెం: అకారణంగా వేరొకరిపై దాడి చేయడంతో పాటు విచారణ నిమిత్తం వెళ్లిన పోలీసులను చంపుతానని బెదిరించిన వ్యక్తిపై కేసు నమోదయ్యింది. వివరాలు.. మండల పరిధిలోని చాకిరాల గ్రామానికి చెందిన యాతాకుల వాలి శనివారం అదే గ్రామానికి చెందిన వరికుప్పల కళింగరావుపై అకారణంగా దాడి చేసి గాయపరిచాడు. దీంతో కళింగరావు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆదివారం విచారణ నిమిత్తం పోలీసులు చాకిరాల గ్రామానికి వెళ్లగా వాలి తన వద్ద ఉన్న బ్లేడుతో పోలీసులను చంపుతానని బెదిరించడంతో పాటు తాను ఆత్మహత్య చేసుకుంటానని బ్లేడుతో గొంతుకోసుకోబోయాడు. దీంతో అక్కడే ఉన్న పోలీసులు అతడిని ఆపే ప్రయత్నం చేయగా బ్లేడు ప్రమాదవశాత్తు వాలి చాతికి తగిలి గాయమైంది. వెంటనే వాలికి చికిత్స చేయించి, అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ ఏడుకొండలు తెలిపారు. వాలిపై గతంలో పలు కేసులతో పాటు రౌడీషీట్ కూడా ఉన్నదని పేర్కొన్నారు.

పంచాయతీలకు అదనపు భారం

- 'కంటి వెలుగు' ఏర్పాట్ల బాధ్యతలపై ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేక బడ్జెట్ ఇవ్వాలని సర్పంచ్‌ల వినతి
- ఇప్పటికే అప్పుల్లో ఉన్నామంటూ ఆవేదన



బూరుగడ్డ గ్రామపంచాయతీ కార్యాలయం

హుజూర్‌నగర్‌రూరల్ : కంటి వెలుగు రెండో విడత కార్యక్రమం జనవరి 18న రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభం కానున్నది. ఈ నేపథ్యంలో గ్రామాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తుండగా.. అందుకు అవసరమైన మౌలిక వసతులు కల్పించాల్సిందిగా ప్రభుత్వం పంచాయతీలను ఆదేశించింది. ఈ కార్యక్రమంలో భాగంగా టెంట్లు, బల్లలు, కుర్చీలు తాగునీటి వసతి ఖర్చులు పంచాయతీ ఖాతా నుంచి భరించాలని స్పష్టం చేసింది. కాగా ఇప్పటికే పలు అభివృద్ధి పనులకు సంబంధించి బిల్లులు రాక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని, కంటి వెలుగు ఖర్చులు భరించలేమని సర్పంచ్‌లు చేతులేత్తేస్తున్నారు. ప్రభుత్వం నిర్ణయం సరికాదని మండిపడుతున్నారు. ఇప్పటికే డీపీఓలు, కార్యదర్శులకు పంచాయతీరాజ్ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల కాపీలు అందాయి. గ్రామాల్లో ఇప్పటి వరకు చేసిన పనులకు బిల్లులు రాక నెలల తరబడి ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమపై మరింత భారం మోపడం సరికాదని సర్పంచ్‌లు వాపోతున్నారు.

ఇప్పటికే అప్పుల ఊబిలో..

ప్రభుత్వం పిలుపు మేరకు చాలా మంది సర్పంచ్‌లు గ్రామాల్లో వివిధ అభివృద్ధి పనులకు అందినకాడికల్లా అప్పులు తెచ్చి పనులు చేశారు. తీరా బిల్లు రాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. లక్షల రూపాయలు పెండింగ్‌లో ఉండడంతో తెచ్చిన అప్పులతో నానా అవస్థలు పడుతున్నామని పలువురు సర్పంచ్‌లు ఇటీవల హుజూర్‌నగర్ మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో తమ గోడు వినిపించారు. పంచాయతీ ట్రాక్టర్ డీజిల్, విద్యుత్ బిల్లులు, సిబ్బంది జీతాలకు, ఇతరత్రా పనులకు నిత్యం డబ్బులు చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో కంటి వెలుగు ఏర్పాట్ల ఖర్చులు సర్పంచులే భరించాలంటే మరింత అప్పులపాలవుతామని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కంటి వెలుగు కార్యక్రమానికి ప్రత్యేకంగా నిధులు విడుదల చేయాలని కోరుతున్నారు.

ప్రత్యేక నిధులు ఇవ్వాల్సిందే..



ప్రభుత్వం చేపట్టే కంటి వెలుగు కార్యక్రమం చాలా మంచిది. కానీ నిధులు ఇవ్వకుండా పంచాయతీలపై భారం మోపడం సరికాదు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలి. ఆర్థిక భారం నుంచి సర్పంచ్‌లకు విముక్తి కల్పించాలి. కంటి వెలుగు నిర్వహణ ఖర్చులపై ప్రభుత్వం పునరాలోచన చేయడంతో పాటు పెండింగ్ బిల్లులు మంజూరు చేయాలి.

– శాసనాల నాగసైదయ్య, సర్పంచ్, గోపాలపురం

వాసవీ క్లబ్ సేవలు అభినందనీయం


మాట్లాడుతున్న ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్

- ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్

కోదాడఅర్బన్ : వాసవీ ఇంటర్‌నేషనల్ క్లబ్ దేశవ్యాప్తంగా సామాజిక కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమని ఎమ్మెల్యే బొల్లం మల్లయ్యయాదవ్ అన్నారు. ఆదివారం పట్టణంలో వాసవీక్లబ్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. భావితరాలకు ఉపయోగపడే విధంగా సామాజిక సేవా సంస్థలను స్థాపించిన మహనీయుల ఆలోచనలు అభినందనీయమన్నారు. తోటి వారికి ఎంతో కొంత సేవ చేయాలనే సంకల్పంతో 1996లో మొదలైన వాసవీ క్లబ్ సంస్థ నేడు వేలాది మంది సభ్యులతో అభివృద్ధి చెందడం గర్వకారణమన్నారు. నూతన కార్యవర్గం గత కార్యవర్గం కన్నా ఎక్కువ సేవా కార్యక్రమాలు చేపట్టి ఆదర్శంగా నిలవాలన్నారు. వాసవీ వనిత క్లబ్‌కు తన వంతు సహకారం అందిస్తానన్నారు. కార్యక్రమంలో జగ్గయ్యపేట మాజీ ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య, కోదాడ డీఎస్పీ వెంకటేశ్వరరెడ్డి, నూతన కార్యవర్గం సభ్యులు, ఇతర ఆర్యవైశ్య ప్రముఖులు తదితరులు పాల్గొన్నారు.

జబ్బార్‌కు జాతీయ పురస్కారం


పురస్కారం అందుకుంటున్న జబ్బార్

చిలుకూరు: మండలంలోని రామాపురం గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు జబ్బార్ ఆదివారం చిట్యాలలో నిర్వహించిన అవార్డుల ప్రధానోత్సవంలో పుడమి సాహితీ వేదిక వారి తెలుగు తేజం జాతీయ విశిష్ట సేవా పురస్కారం అందుకున్నారు. విద్యారంగంలో చేసిన కృషికి గాను తనకు ఈ పురస్కారం అందజేసినట్లు జబ్బార్ పేర్కొన్నారు.

తెలంగాణ పథకాలు దేశానికే ఆదర్శం


పార్టీ కండువాలు కప్పి బీఆర్‌ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సైదిరెడ్డి

- ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి

హుజూర్‌నగర్ : తెలంగాణలో సీఎం కేసీఆర్ అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మఠంపల్లి మండలానికి చెందిన పలువురు నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి ఆయన పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అభివృద్ధికి ఆకర్షితులై పలువురు బీఆర్‌ఎస్ పార్టీలోకి వస్తున్నారని అన్నారు. సీఎం కేసీఆర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో పలు సంక్షేమ కార్యక్రమాలు అవుతున్నాయన్నారు. పార్టీలో చేరిన వారిలో కె.నాగరాజు, బి.కోట్యా, వినోద్ తదితరులు ఉన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మన్యం శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు బాలు, వెంకట్‌నారాయణ, వెంకట్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఎమ్మెల్యేను గరిడేపల్లి మండలం పొనుగోడు గ్రామానికి చెందిన మత్స్య సహకార సంఘం సభ్యులు మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం సంఘం నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నాయకులు జోగు అరవింద్‌రెడ్డి, మత్స్యశాఖ సంఘం సభ్యులు పాల్గొన్నారు.

బిహార్ తరహాలో కుల గణన చేపట్టాలి

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కృష్ణమాచారి


సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణమాచారి

హుజూర్‌నగర్ : తెలంగాణతో పాటు దేశ వ్యాప్తంగా బిహార్ తరహాలో కుల గణన చేపట్టాలని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా ఇన్‌చార్జ్ మోడేపల్లి కృష్ణమాచారి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో నిర్వహించిన బీసీ సంక్షేమ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈనెల 21నుంచి బిహార్ రాష్ట్రంలో కుల గణన చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. దీనిని అన్ని రాష్ట్రాల సీఎంలు ఆదర్శంగా తీసుకుని బీసీ కుల గణన చేపట్టాలని డిమాండ్ చేశారు. దీంతో ఆయా కులాల ఆర్థిక సామాజిక పరిస్థితులు స్పష్టంగా తెలుస్తాయన్నారు. ఆయా కులాల సంక్షేమం అభివృద్ధికి రాష్ట్ర బడ్జెట్లో నిధులు కేటాయించడం సులభతరం అవుతుందన్నారు. 56శాతం ఉన్న బీసీలకు కేవలం 17శాతం సీట్లు మాత్రమే కేటాయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తెలంగాణలో కోటి మంది బీసీ మహిళలు ఓటు హక్కు కలిగి ఉన్నారని, శాసనమండలిలో కాని, శాసనసభలో కాని ఒక్క బీసీ మహిళ కూడా ప్రాతినిధ్యం లేకపోవడం దురదృష్టకరమన్నారు. మన ఓటు మనకే నినాదంతో బీసీలు ముందుకు సాగితే రాజ్యాధికారం బీసీల హస్తగతం అవుతుందని, అప్పుడు బీసీల అభ్యున్నతికి కావాల్సిన చట్టాలు రూపొందించుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు ధూళిపాల ధనుంజయనాయుడు, గుండు రాంబాబు, ధూళిపాల శ్రీనివాస్, జనిగల శ్రీనివాస్, బొడ్డు గోవిందరావు, గడ్డం అంజి, గూడెపు దీప, కె.వెంకటేశ్వర్లు, ఆర్.వెంకటేశ్వర్లు, నరసింహాచారి, సైదయ్య తదితరులు పాల్గొన్నారు.

గీత కార్మికుల సంక్షేమానికి కృషి


పూలమాలలతో కేఎల్‌ఎన్ ప్రసాద్‌ను సన్మానిస్తున్న సంఘం సభ్యులు

అనంతగిరి : గీత కార్మికుల సంక్షేమానికి కృషి చేస్తానని కౌండిన్య గౌడ సంఘం రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు కేఎల్‌ఎన్ ప్రసాద్ అన్నారు. మండల పరిధిలోని ఖానాపురం గ్రామానికి చెందిన కల్లుగీత కార్మికులకు మంజూరైన నూతన లైసెన్స్‌లను ఆదివారం ఆయన అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 30సంవత్సరాలుగా కల్లు గీత కార్మికులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందజేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. అనంతరం కౌండిన్య గౌడ సంఘ సభ్యులు శాలువాలు, గజమాలలతో ఆయనను సత్కరించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు ఉయ్యాల వీరయ్యగౌడ్, కాసాని రాములు, వెంకటేశ్వర్లు, సైదమ్మ, వీరయ్య, నవీన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఎమ్మెల్యే మతి తప్పి మాట్లాడటం తగదు


మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

హుజూర్‌నగర్ : స్థానిక ఎమ్మెల్యే సైదిరెడ్డి మతి తప్పి మాట్లాడటం తగదని దక్షిణ మధ్య రైల్వే జోనల్ మెంబర్ యరగాని నాగన్న, పట్టణ, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు తన్నీరు మల్లికార్జునరావు, అరుణ్‌కుమార్ అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎంపీ క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డిపై ఎమ్మెల్యే సైదిరెడ్డి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. దేశం కోసం పనిచేసిన సైనికుడిపై ఎమ్మెల్యే మాట్లాడిన తీరు మతిభ్రమించి మాట్లాడుతున్నట్లుగా ఉందన్నారు. ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి కంకణం కట్టుకొని పనిచేస్తే స్థానిక ఎమ్మెల్యే అక్రమంగా ఆస్తులు సంపాదించుకుంటున్నది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. వ్యక్తిగత దూషణలు మానుకుని రాజకీయ కోణంలో విమర్శలు చేయాలని, లేకుంటే కాంగ్రెస్ శ్రేణులు ప్రతి ఘటించటం ఖాయమన్నారు. సమావేశంలో కాంగ్రెస్ నాయకులు కోతి సంపత్‌రెడ్డి, బాచిమంచి గిరిబాబు, వెలిదండ వీరారెడ్డి, బొల్లెద్దు ధనమ్మ జైలు, వీరబాబు, రాములు, ముక్కంటి, రామరాజు, యోహాన్, రాము, చంద్రశేఖర్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం


వృద్ధులకు అన్నదానం చేస్తున్న దాతలు

మునగాల : మండల పరిధిలోని ముకుందాపురం శివారులో గల ఇందిర అనాథ వృద్ధాశ్రమంలో ఆదివారం ముకుందాపురం గ్రామానికి చెందిన పోలిశెట్టి ఇందిర ఆమె కుమారుడు హరిసాయి వృద్ధులకు, మానసిక దివ్యాంగులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మండలంలోని నర్సింహాపురం గ్రామానికి చెందిన సామాజిక ఉద్యమకారుడు డా.వేమూరి సత్యనారాయణ, మురారిశెట్టి చంద్రయ్య, హైమావతి, ఆశ్రమ నిర్వాహకురాలు నాగిరెడ్డి విజయమ్మ, కొండ్రు గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కొనసాగుతున్న ధనుర్మాస ఉత్సవాలు


హుజూర్‌నగర్ : శోభాయాత్రలో పాల్గొన్న ఎమ్మెల్యే సైదిరెడ్డి, భక్తులు


హుజూర్‌నగర్‌రూరల్ : గోదాదేవి పూజా కార్యక్రమంలో పాల్గొన్న భక్తులు

హుజూర్‌నగర్ : పట్టణంలోని శ్రీ వేణుగోపాల సీతారామచంద్ర స్వామి ఆలయంలో ఆదివారం ధనుర్మాస ఉత్సవాల్లో భాగంగా శోభాయాత్రను వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తొమ్మిది రకాల వాహనాలపై స్వామివారిని ఉంచి ఊరేగింపు నిర్వహించారు. శోభాయాత్రలో పెద్దగరుడ వాహనంపై సీతా లక్ష్మణ సమేత రామచంద్ర స్వామి, చిన్న గరుడవాహనంపై ఉభయదేవేరులైన రుక్మిణి సత్యభామ సమేత వేణుగోపాలస్వామి, పల్లకిలో చక్ర పెరుమాళ్లు, హనుమంత వాహనంపై ఆంజనేయుడు, శేషవాహనంపై శ్రీమద్రామానుజులు, కల్పవక్ష వాహనంలో గోదాదేవి అమ్మవారు, అశ్వవాహనంపై శ్రీ నమ్మాళ్వారులు, హంస వాహనంపై పేరియాల్వర్లు, గజవాహనంపై విశ్వక్సేనుడు వేంచేసి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రధాన వీధుల్లో 108 దివిటీలతో మహిళల హారతులు, కోలాట భజనలతో వైభవంగా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయంలో నీరాజనం మంత్ర పుష్పాలతో తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. శోభాయాత్రలో ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి, ఆలయ పాలకవర్గం, ఆలయ అభివద్ధి కమిటీ సభ్యులు, భక్తులు, పుర ప్రముఖులు, మహిళలు పాల్గొన్నారు.

హుజూర్‌నగర్‌రూరల్ : మండలంలోని బూరుగడ్డలో గల శ్రీ ఆదివరహ లక్ష్మీనర్సింహ వేణుగోపాల స్వామి దేవాలయంలో ధనుర్మాస ఉత్సవాలను పురస్కరించుకొని 24వ రోజు పూజా కార్యక్రమాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం సుప్రభాతసేవ, ఆరాధన, అమ్మవారికి పంచామృతాలతో అభిషేకం, అష్టోత్తర శతమావళి, సేవాకాలం, అలంకరణ, మంగళశాసనం, ఆలయ ప్రాంగణంలో అమ్మవారికి పల్లకిసేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వాహణాధికారి ఎంపీ లక్ష్మణరావు, మాజీ ధర్మకర్తలు యరగాని రామస్వామి, రాగం లింగయ్య, యరగాని కిరణ్‌గౌడ్, కనకయ్య, గురుస్వామి, గోపాల్, లింగయ్య, మల్లయ్య, అర్చకులు హరీష్‌కుమార్ చార్యులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గరిడేపల్లి : మండలంలోని పొనుగోడు గ్రామంలో జై శ్రీమన్నారాయణ వేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాసోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఆదివారం ఉదయం సుప్రభాతసేవ, ఆరగింపు మంగళశాసనములు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ జోగు సరోజనమ్మ, ఆలయ మాజీ చైర్మన్ యల్లావుల పిచ్చయ్య, రైస్ మిల్లర్ పారేపల్లి గురునాథంగుప్తా దంపతులతో పాటు పలువురు భక్తులు తదితరులున్నారు.


గరిడేపల్లి : గోదాదేవిని ఊరేగింపుగా తీసుకువస్తున్న అర్చకులు, భక్తులు

ఆలయంలో లక్ష కుంకుమార్చన పూజలు

మఠంపల్లి : మండలంలోని చౌటపల్లిలో గల శ్రీరుక్మిణీ, సత్యభామా సమేత శ్రీవేణుగోపాలస్వామి దేవాలయంలో ధనుర్మాస పూజల్లో భాగంగా వార్షికంగా నిర్వహించే లక్ష కుంకుమార్చన పూజలను ఆదివారం మహిళలు అధిక సంఖ్యలో హాజరై ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయంలో ప్రత్యేకార్చనలు, మహానివేదన గావించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఈఓ ఎంపీ లక్ష్మణరావు, ఆలయ మాజీ చైర్మన్ మద్ది హుస్సేన్‌రెడ్డి, అర్చకులు నరగిరినాథుని కృష్ణమాచార్యులు, శ్రీనివాసాచార్యులు, మురళీధరాచార్యులు, గోవిందరెడ్డి, గురువయ్య, ఉపేందర్, శాగంరెడ్డి సీతమ్మ, మహిళలు తదితరులు పాల్గొన్నారు.


మఠంపల్లి : లక్ష కుంకుమార్చనలో పాల్గొన్న మహిళలు, ఈఓ, గ్రామపెద్దలు

ఆత్మ విశ్వాసమే విజయానికి ఆయుధం


అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎనలిస్ట్ డాక్టర్ అందె సత్యం

కోదాడఅర్బన్ : ఆత్మవిశ్వాసమే విజయానికి ఆయుధమని విశ్రాంత విద్యావేత్త మంత్రిప్రగడ భరతరావు, శ్రీరామకవచం వెంకటేశ్వర్లు, ఎకానమిక్స్ ఎనలిస్ట్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ అందె సత్యం అన్నారు. ఆదివారం పట్టణంలోని ఎస్వీ డిగ్రీ కళాశాలలో శ్రీ సాయి కోచింగ్ అకాడమీ ఆధ్వర్యంలో గ్రూప్ 1,2,3,4తో పాటు, హాస్టర్ వెల్ఫేర్ ఆఫీసర్లు, అధ్యాపక పోస్టులకు సిద్ధమయ్యే అభ్యర్థులకు నిర్వహించిన అవగాహన సదస్సులో వారు పాల్గొని మాట్లాడారు. ఉద్యోగాలకు దరఖాస్తు చేసిన అభ్యర్థులు ప్రణాళికాయుతంగా చదవాలన్నారు. పరీక్ష రాసేటప్పుడు ఆందోళనలకు గురికాకుండా సమయస్ఫూర్తితో పరీక్షలు రాయాలన్నారు. విద్యావేత్త అనంతారపు కృష్ణయ్య ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కోచింగ్ సెంటర్ గ్రామీణ ప్రాంత నిరుద్యోగ యువతీ, యువకులకు ఉద్యోగాల సాధనకు ఎంతో దోహదపడతాయన్నారు. అనంతరం ఎస్వీ విద్యా సంస్థల చైర్మన్ ముత్తినేని సైదేశ్వరరావు, కేఎస్ఎం కళాశాల మిర్యాలగూడ రిటైర్డ్ ప్రిన్సిపాల్ పోందూరు ప్రభాకర్‌లు మాట్లాడారు. నిరుద్యోగులకు అవగాహన సదస్సులు ఎంతో దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు నర్సిరెడ్డి, బడుగుల సైదులు, రామనర్సయ్య, సాయి కోచింగ్ సెంటర్ డైరెక్టర్ అనంతారపు కృష్ణయ్య పాల్గొన్నారు.

రామారావు ఆశయ సాధనకు కృషి చేయాలి


రామారావు వర్ధంతి సభలో మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

మునగాల : తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధుడు, సీపీఎం నాయకుడు, కొక్కిరేణి గ్రామ మాజీ సర్పంచ్ బహుదొడ్డి రామారావు జీవితం ఆదర్శనీయమని, ఆయన ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ కృషిచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేదరమెట్ల వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని కొక్కిరేణిలో రామారావు 19వ వర్ధంతి సభ నిర్వహించారు. తొలుత ఆయన స్మారకస్థూపం వద్ద చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీపీఎం పార్టీ నిర్మాణంలో రామారావు ముఖ్యమైన పాత్ర పోషించారన్నారు. ఈ ప్రాంతంలో పార్టీలో అతివాద, మితవాద ధోరణులు వచ్చినప్పుడు మొత్తం పార్టీని ఐక్యం చేసి మార్క్సిస్ట్ పార్టీ వైపు ప్రజలను నిలబెట్టడంలో రామారావు నిర్వహించిన పాత్ర ఎనలేనిదన్నారు. రానున్న కాలంలో అమరవీరుల స్ఫూర్తితో ప్రజా ఉద్యమాలకు ప్రజలు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పార్టీ గ్రామ కార్యదర్శి నందిగామ సైదులు, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు పోటు పుల్లయ్య, వట్టెపు చినసైదులు, ములకపల్లి నాగరాజు, మామిడి గురుమూర్తి, రైతుసంఘం గ్రామ కార్యదర్శి రావులపెంట వెంకన్న, వ్యవసాయ కార్మిక సంఘం మండల ఉపాధ్యక్షుడు ములకలపల్లి సైదులు, ఉపసర్పంచ్ రావులపెంట బ్రహ్మం, హుస్సేన్, సామాజిక కార్యకర్త ఎల్లావుల సైదులు, మామిడి లింగయ్య, అత్తర్‌పాషా, లింగయ్య పాల్గొన్నారు.

కళాకారుడు పిచ్చయ్యకు సన్మానం


పిచ్చయ్యను సన్మానిస్తున్న ఆర్మీ అధికారులు

మఠంపల్లి : మండల కేంద్రానికి చెందిన రంగస్థల కళాకారుడు గుంటి పిచ్చయ్యను ఆదివారం విజయవాడలోని కేబీఎన్ కళాశాలలో జరిగిన ఆర్మీడే వేడుకల్లో మెమెంటో, శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడారు. ఆర్మీడే వేడుకల్లో పుండరీ కాక్షయ్య ఏకపాత్రాభినయం ప్రదర్శనకుగాను ఆంధ్రా బెటాలియన్ ఆర్మీ అధికారి రాకేష్‌యాదవ్ చేతుల మీదుగా పురస్కారం అందుకున్నట్లు తెలిపారు.

కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలి

మునగాల : కార్మికుల సంక్షేమానికి ప్రభుత్వాలు కృషి చేయాలని ఏఐటీయూసీ డివిజన్ నాయకుడు మేకల శ్రీనివాసరావు కోరారు. ఆదివారం మండలం కేంద్రంలో నియోజకవర్గ స్థాయి భవన నిర్మాణ కార్మిక సంఘం విస్తృతస్థాయి సమావేశం సీఐటీయూ, ఏఐటీయూసీ అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా ఈ సమావేశంలో పలువురు భవన నిర్మాణ సంఘం నాయకులు, మేస్త్రీలు పాల్గొని పలు ఏకగ్రీవ తీర్మానాలు చేశారు. సమావేశంలో మేస్త్రీలు, అనుబంధాల సంఘాల నాయకులు పల్లపు శ్రీను, ఒగ్గు సైదులు, వీరయ్య, మల్లికార్జున్, మునగాల మండల అధ్యక్ష, కార్యదర్శులు షేక్ దస్తగిరి, నాగేంద్రబాబు, మేస్త్రీలు నాగరాజు, పాషా, ఆంజనేయులు, జానీపాషా పాల్గొన్నారు.